క్లుప్తంగా

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా అంజన్‌కుమార్



కేతేపల్లి: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామానికి చెందిన అల్లి అంజన్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. తన నియమకానికి సహకరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అంజన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నవోదయ మోడల్ టెస్ట్

రామగిరి(నల్లగొండ): షార్ప్ మైండ్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం 10.30 గంటలకు 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నూతన సిలబస్ ప్రకారం నవోదయ ఎంట్రెన్స్ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ వి.నాగేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9393949497, 8919623690ను సంప్రదించాలన్నారు.

యువత భాగస్వామ్యం కావాలి

మర్రిగూడ : సనాతన సంస్కృతిలో యువత భాగస్వామ్యం కావాలని సామాజిక కార్యకర్త కల్లెట్ల అరుణ్‌సాగర్ అన్నారు. శనివారం మండలంలోని కొట్టాలలో బోనాల సందర్భంగా గ్రామ దేవతలైనా ముత్యాలమ్మ, సోమప్ప, పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణాల్లో రూ.20వేల విలువగల రెండు సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట కవిత యాదయ్య, కల్లెట్ల రాజు, కక్కునూరి వెంకటేష్, జనగాం శేఖర్‌గౌడ్, రాసాల సునీల్, కక్కునూరి దండయ్య, కల్లెట్ల చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

శాలిగౌరారం: మండలంలోని శాలిలింగోటం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 63 హెచ్‌పీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రైతులతో కలిసి స్థానిక బీఆర్‌ఎస్‌పార్టీ నాయకుడు పాక యాదయ్య ప్రారంభించారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు బండారు శ్రీను, సైదులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

చండూరు : చండూరుకు చెందిన నిరుపేద చేనేత కార్మికుడు వనం రాములు (80) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత పంపించిన రూ. 10వేలను చేనేత కార్మిక సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో పాటు కర్నాటి మురళి, మరికొందరు సమకూర్చిన 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులు కర్నాటి శ్రీనివాసులు, చెరుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు ఏలే శ్రీనివాస్, రాపోలు వెంకటేశం, సంగెపు శ్రీను, సహాయ కార్యదర్శులు చెరుపల్లి నరేష్, రావిరాల అశోక్ పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని చిట్టంపహాడ్ గ్రామానికి చెందిన జగన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం శనివారం సర్పంచ్ చందుయాదవ్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

గొర్రెల యూనిట్ల పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ

చండూరు : చండూరు మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన 21మంది లబ్ధిదారులకు శనివారం ఆ గ్రామ ఎంపీటీసీ పెందోటి వెంకటమ్మ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పెండ్యాల గీత పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునిత తదితరులు ఉన్నారు.

సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి

శాలిగౌరారం: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.55 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవన నిర్మాణ పనులను మార్కెటింగ్ ఏఈ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, మార్కెట్ కార్యదర్శి టీనానాయక్, మామిడి సర్వయ్య, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.

మురుగు పోయే దారేదీ..

- పట్టణమంతా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వేయాలంటే రూ.600 కోట్లు అవసరం
- ప్రస్తుతం 'అమృత్–2'లో వచ్చేది రూ.216 కోట్లే..
- మున్సిపాలిటీలో ఉన్న యూజీడీ 200కిలో మీటర్లు
- మరో 400కిలో మీటర్లు వేస్తేనే తీరనున్న సమస్య



నల్లగొండలోని ఓ కాలనీలో మురుగు కాలువ ఇలా..

నల్లగొండ టూటౌన్ : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీలగిరి మున్సిపాలిటీ విస్తీర్ణం భారీగా పెరిగిపోయింది. సమీప ప్రాంతాలకు చెందిన వారు తమ పిల్లల చదువులు, ఉపాధి కోసం పట్టణానికి వస్తుండడంతో దశాబ్ద కాలంగా విస్తీర్ణం పెరిగింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుయాపాల కల్పన లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నీలగిరి మున్సిపాలిటీ 108కిలో మీటర్ల విస్తరించి ఉంది. ఇంత పెద్ద పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా తగిన సౌకర్యాల కల్పన అంత వేగంగా కల్పించకపోవడంతో పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు నీటి సమస్య జఠిలంగా మారుతోంది. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. మున్సిపాలిటీలోని 48వార్డుల పరిధిలో యూజీడీ ఎప్పటికి వేస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కొన్ని కాలనీల్లో ఎక్కడికక్కడే మురుగు

కొన్ని కాలనీల్లో మురుగు నీరు, అటు వర్షపు నీరు దిగువకు పోవడానికి సరైన నాళాలు, భూగర్భ మురుగు కాల్వలు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ మురుగు నిలిచిపోతుంది. మురుగు నీటి కాల్వలు అన్ని వార్డుల్లో లేకపోవడంతో స్థానికుల మధ్య ఘర్షణలు సైతం జరుగుతున్నాయి. ఒకరి ఇంటిలోని మురుగు నీరు మరో ఇంటి వైపు రాకుండా అడ్డుకునే అవకాశం లేకపోవడం, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసాల వద్దకు మురుగు నీరు చేరడం లాంటి సమస్యలతో వారి మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలంటే నీలగిరి పట్టణమంతా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

యూజీడీకి రూ.600కోట్లు అవసరం

నీలగిరి మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం లేదు. మొత్తం 400కిలో మీటర్లు యూజీడీ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. కానీ 400 కిలో మీటర్ల యూజీడీ నిర్మాణం చేపట్టాలంటే దాదాపు రూ.600కోట్లు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గంధంవారిగూడెం, మామిళ్లగూడెం, చర్లపల్లి, కేశరాజుపల్లి, ఆర్జాలబావి, మర్రిగూడ, శేషమ్మగూడెం గ్రామాలతో పాటు వాటి సమీపంలోని చిన్న గ్రామాలు, పానగల్‌లో కొంతభాగం, పానగల్ రోడ్డులో 18, 19వ వార్డులు, పాతబస్తీలో కొంతభాగం, మహిళా ప్రాంగణం, ముషంపల్లి రోడ్డు, ఇటీవల కొత్తగా వెలిసిన పలు కాలనీలు తదితర ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం మురుగు నీటి సమస్య చాలా తీవ్రంగా వేధిస్తోందని పాలకవర్గ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'అమృత్-2' నిధులతో మరో 150 కిలోమీటర్లు..

అమృత్–2 పథకం కింద నీలగిరి పట్టణం ఎంపికైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ పనులు చేపట్టనున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం దాదాపు 150 కిలో మీటర్లు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అమృత్ –2 పథకం కింద నీలగిరి పట్టణానికి రూ. 216 కోట్లు మంజూరయ్యాయి. కానీ, నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఈ నిధులతో 150 కిలో మీటర్లు పూర్తి అయినా మిగతా 250కిలో మీటర్లు మిగిలే ఉండనుంది.

హోంమంత్రికి ఘన స్వాగతం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి మహబూబ్ అలీ



హోంమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ఆర్.వి. కర్ణన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మదీనా మసీదులో నిర్వహించిన రెండవ అఖిల భారత హిఫ్జ్, ఖిరాతె ఖురాన్, అజాన్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర హోంశాఖ మంత్రి మహబూబ్ అలీకి శనివారం వీటీ కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఘన స్వాగతం పలికారు. కాసేపు ఎమ్మెల్యే నివాసంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, ఎస్పీ అపూర్వ రావు హోంమంత్రికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

మునుగోడు : చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చెర్కు సైదులు అన్నారు. చేనేత కార్మికులకు అందిస్తున్న ఆసరా పింఛన్ల పంపిణీని హర్షిస్తూ శనివారం మునుగోడు చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చెర్కు సైదులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చెర్కు కృష్ణయ్య, చిలుకూరి మధు, చెరుపల్లి లక్ష్మయ్య, పూల వెంకటేషం, కర్నాటి రాజు, సామల యాదగిరి, కృష్ణయ్య, శ్రీను, కిషన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



చింతబాయిగూడెంలో ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసే ఇతర పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామానికి చెందిన 100 కుటుంబాలు శనివారం నల్లగొండలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాషా, తవిటి కృష్ణ, సత్యనారయణ, సైదులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

నల్లగొండ పట్టణంలోని 9వ వార్డు చింతబాయిగూడెంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనగల్ ఎంపీపీ కరీంపాషా, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీని వాస్‌రెడ్డి, యాదగిరి, నాగయ్య, దండెంపల్లి సత్త య్య, కన్నెబోయిన అంజిబాబు యాదవ్, దేప రాంరెడ్డి, నరసింహ, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'చారుమతి' సేవలు అభినందనీయం

రామగిరి(నల్లగొండ): చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణ శివారు పానగల్లులో చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఐవీ, అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న తమ సేవలను గుర్తించి ఆదరిస్తున్న దాతలకు సెంటర్ వ్యవస్థాపకుడు నాగసేనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, కందిమల్ల హేమ, రుక్మిణమ్మ, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంతో రైతులకు మెరుగైన సేవలు

నల్లగొండ రూరల్ : ప్రాథమిక సహకార సంఘాలతో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పానగల్‌లో గొల్లగూడెం సహకార సంఘం భవనాన్ని చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రుద్రాక్షి వెంకన్న, హాషం, దొటి అంజయ్య, తక్కెళ్ల రేణుక, సూర మహేష్, యాట శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్, కట్టా వెంకట్ రెడ్డి, ఆదిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

కేతేపల్లి: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 50కుటుంబాల వారు బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాచకొండ సైదులు ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారిలో చందుపట్ల గిరి, ఏసు, రాజు, ధనాకర్, ఉల్లెందుల మహేష్, ఊర విజయ్, అంజి, చింత సుదర్శన్, శాంతికుమార్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచి జానకిరాములు, ఎంపీటీసీ బుర్రి యాదవరెడ్డి, ఉపసర్పంచి తండు రాములు, కట్ట శ్రవణ్, మాజీ ఎంపీటీసీ సునీత, మారం వెంకట్ రెడ్డి, మునగ లింగమూర్తి, యూసఫ్‌అలీ, ఊర యాదగిరి, మునగ రవీందర్ పాల్గొన్నారు.

అనుమతి ఇవ్వొద్దని ఎమ్మెల్యేకు వినతి

నార్కట్‌పల్లి : ఇతర రాష్ట్రాల వ్యాపారులకు నార్కట్‌పల్లి పట్టణంలో అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ పట్టణ వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నార్కట్‌పల్లి క్యాంపు కార్యాలయలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు బోడ వెంకన్న, బెల్లి దశరథ, బోయపల్లి శ్రవణ్‌కుమార్, కొప్పు అంజన్‌కుమార్, రమేష్‌రెడ్డి, దోబెట్టి కనకరావు, సత్యనారయణ, శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్‌చారి, మహేంద్రకుమార్, లింగస్వామి, శివరాం, రమేష్, వీరకుమార్ శంకరాచారి ఉన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

చిట్యాల: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో శనివారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలను వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి అ్రరూరి శ్రీను, నాయకులు నెల్లికంటి నర్సింహ, పంది నరేష్, అ్రరూరి శంభయ్య, మామిడి రాములు, దేశగోని లింగస్వామి పాల్గొన్నారు.

12న స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపిక

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఈ నెల 12 స్కూల్ గేమ్స్(పాఠశాల క్రీడలు) జట్ల ఎంపిక జరుగనుందని ఇన్‌చార్జి మండల విద్యాధికారి ఎం.నాగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులచే జారీ చేయబడిన పుట్టినతేది, స్టడీ కండక్ట్ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు మండలస్థాయి క్రీడల కన్వీనర్ జ్యోతి సెల్‌నెంబర్ 9000091682 ను సంప్రదించాలని తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయ భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

చండూరు : చండూరులో నూతనంగా ఏర్పాటు కానున్న ఆర్డీఓ కార్యాలయ భవనాన్ని శనివారం మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. కార్యాలయంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయం ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, తహసీల్దారు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలోనే బ్రిడ్జి పనులు ప్రారంభం

నాంపల్లి : మండలంలోని తుంగపహాడ్ గ్రామంలో పులుసు వాగు బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు





పార్టీ నేతలకు దరఖాస్తులు అందజేస్తున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : బీజేపీ తరపున నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి శనివారం అధిష్టానానికి వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి తమకు అవకాశం కల్పించాలని కోరారు.

చిట్యాల : బీజేపీ నకిరేకల్ అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తూ చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన గంజి వివేకానంద శనివారం హైదరాబాద్‌లో ఆ పార్టీ అధిష్టానికి దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మైల నర్సింహ, బొడిగె లక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు చేరుకు ప్రవీణ్, నార్సింగ్ వెంకటేశ్వం, పాపని వాసుదేవ్, గరిషె నరేష్, సోమగోని నర్సింహ పాల్గొన్నారు.

నకిరేకల్ : బీజేపీ తరపున నకిరేకల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు రామన్నపేటకు చెందిన నకిరేకంటి మొగిలయ్య శనివారం దరఖాస్తు చేశారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు మండల వెంకన్న, తాటిపాముల శివ కృష్ణ, పోట్లపల్లి నర్సింహ,గోర్రెల శ్రీను, కొరివి శంకర్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, పల్స శ్రీనుగౌడ్, రాచకొండ గోపి, గుడుగుంట్ల సాయన్న, జిల్లా డాకయ్య తదితరులు ఉన్నారు.

కాళోజీ నారాయణరావుకు ఘన నివాళి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు



కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయంలో..



నల్లగొండ బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో..

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు అంజయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సిబ్బంది కట్ట నాగయ్య, ఎం.నిర్మలదేవి, రాజేష్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో..

నల్లగొండ పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శనివారం కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కవులు బైరెడ్డి కృష్ణారెడ్డి, శంకరయ్య, సాగర్ల సత్తయ్య, కోమటి మదుసూదన్, అప్పల ఉప్పల పద్మ, నామ వెంకటేశ్వర్లు, నల్ల నరసింహ, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, రాములు, మీనయ్య పాల్గొన్నారు.

కాళోజీ స్ఫూర్తితోనే తెలంగాణ

కట్టంగూర్ : కాళోజీ రచనల స్ఫూర్తితోనే తెలంగాణ సాకారమైందని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ చలపతి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోలి అంతయ్య, లక్ష్మణ్, గోవింద్, సైదమ్మ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

చిట్యాల: పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై గల జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బంది కాపలా లేకపోవడంతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిరసన

నల్లగొండ రూరల్ : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని కక్ష పూరితంగా అరెస్ట్ చేశారని ఆ పార్టీ నాయకులు ఎల్‌పీ యాదవ్, శేఖర్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం టీడీపీ నాయకులు నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, ఆకునూరి సత్యనారాయణ, సిద్దీఖ్, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

మునుగోడు: మండల కేంద్రంలోని దుకాణాల సముదాయం వెనుక భాగంలో మురుగు కాల్వను కబ్జా చేసి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని బీఎస్పీ మండల మాజీ అధ్యక్షుడు పందుల హరీష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఘనంగా వనమహోత్సవం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణ శివారు చర్లపల్లిలోని విపస్యా స్కూల్‌లో గ్రీన్‌డే సందర్భంగా శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు అరటి ఆకుల్లో భోజనాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆకుపచ్చ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

'బీసీ సింహగర్జన'ను విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చిట్యాల: బీసీ సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అ్రరూరి వెంకటేశం కోరారు. చిట్యాలలో శనివారం సింహగర్జన సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎద్దులపురి కృష్ణ, గుండెబోయిన సైదులు, రుద్రారపు భిక్షం, చికిలంమెట్ల అశోక్, రెముడాల లింగస్వామి, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కనగల్: మండల పరిధిలోని బోయినపల్లి, బుడుమర్లపల్లి, తేలకంటిగూడెం గ్రామాల్లో శనివారం గ్రామస్తులు ఊర బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు బొడ్రాయికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కారింగు పార్వతమ్మజానయ్యగౌడ్, పగిళ్ల యాదగిరి, బోగరి రాంబాబు, గానుంతల భాస్కర్‌రెడ్డి, భిక్షాల సైదమ్మశ్రీను పాల్గొన్నారు.

టికెట్ సామాన్య కార్యకర్తకు ఇచ్చినా గెలిపిస్తాం

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ నుంచి నకిరేకల్ అసెంబ్లీ టికెట్ సామాన్య కార్యకర్తకు ఇచ్చినా గెలిపిస్తామని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటన విషయంలో కొందరు కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్ద కొత్తవారి చేరికల ప్రస్తావన లేదన్నారు. సమావేశంలో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, పోతుల గిరి, దేవులపల్లి వెంకన్న, యూసుఫ్, వంటిపాక నక్షత్, మాజీద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దైద రవీందర్

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా సతీష్‌కుమార్

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన మార్గం సతీష్‌కుమార్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనకు వారు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరు నారాయణయాదవ్, కర్నాటి యాదగిరి, అల్లివేణుయాదవ్, కల్లూరి సత్యనారాయణ, వెంకన్న, మల్లేపల్లి సతీష్, ఉజ్వల్, సాయిరాం, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

❖ బోనమెత్తిన ఎలికట్టె



చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో బోనాలతో మహిళలు

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామంలో శనివారం ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అలంకరించిన బోనాలు డప్పు చప్పుల మధ్య మహిళలు ఊరేగింపుగా గ్రామ శివారులోని ముత్యాలమ్మగుడి వద్దకు చేరారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

మదర్ థెరిస్సా అంతర్జాతీయ అవార్డుకు ముగ్గురు ఎంపిక

మిర్యాలగూడ టౌన్: మదర్ థెరిస్సా అంతర్జాతీయ అవార్డుకు మిర్యాలగూడ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఈమేరకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మెనేజ్‌మెంట్ శనివారం పోస్టు ద్వారా ఆహ్వానం పంపింది. ఫెయిత్ బంజారా అనాథాశ్రమం నిర్వాహకులు ధీరావత్ హన్యా నాయక్, ధీరావత్ రమాబాయిలు కుష్ఠు రోగులు, వృద్ధులకు చేసిన సేవలకుగాను, అదే విధంగా ధీరావత్ సుధారాణి అందించిన వైద్య సేవలకుగాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులను ఈ నెల 30న న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు హన్యానాయక్ తెలిపారు.

20 అడుగులకు చేరిన డిండి ప్రాజెక్టు నీటిమట్టం

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు పరవళ్లు తొక్కుతుండటంతో డిండి ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 20 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ ఫయాజ్ తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ధర్మారెడ్డి మృతి


ధర్మారెడ్డి(ఫైల్)

హిమాయత్‌నగర్: స్వాతంత్ర్య సమరయోధుడు మండడి ధర్మారెడ్డి(97) మృతిచెందారు. శనివారం హైదరాబాద్‌లో దిల్‌షుక్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ధర్మారెడ్డి మనుమరాలు శ్రావ్యరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో కీలకపాత్ర పోషించారు. జాతిపిత మహాత్మ గాంధీ నేతృత్వంలో జరిగిన శాంతియుత పోరాటాల్లో ధర్మారెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో రాజాకార్ల దౌర్జన్యాల సమయంలో ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేశారు. ధర్మారెడ్డికి భార్య జానకమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, భద్రత పరిశీలన


చేనేతల ఆరోగ్య స్థితిగతులు, తదితర వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం

మోత్కూరు: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షీల నారాయణ బృందం, శేఖర్‌రెడ్డి, డాక్టర్ సంకు శంకర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినర్స్ బృందం శనివారం మోత్కూరులో చేనేత కార్మికుల వ్యక్తిగత ఆరోగ్య స్థితి, వృత్తిపరమైన భద్రతను పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, సాధికారతపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల్లో పురుషులు 51 శాతం, మహిళలు 49 శాతంగా ఉన్నారని వారు తెలిపారు. వారి వెంట యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత మహిళా విభాగం సహాయ కార్యదర్శి రేగోటి ఉషారాణి ఉన్నారు.

సమ్మె సరైంది కాదు

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేయాలని భావించడం సరైంది కాదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘాల జేఏసీ జనరల్ సెక్రెటరీ జ్యోతిపద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ సమ్మెలో భాగస్వామ్యం కావొద్దని సూచించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలను ఇబ్బంది పెట్టే ప్రక్రియకు చేపట్టవద్దని కోరారు. ఉద్యోగులతో సమానంగా పీఆర్సీ పెరిగినప్పుడల్లా అంగన్‌వాడీలకు 30 శాతం జీతం పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు


ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాదె ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎలియాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారన్నారు. పార్టీ పరంగా బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిశోర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మహేష్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, ఆంథోనిరెడ్డి ఉన్నారు.

‘జీ–20’ సదస్సులో జిగేల్..

తేలియా రుమాల్

- ప్రాచీన చేనేత కళకు ప్రపంచ గుర్తింపు
- దేశం మొత్తంగా పుట్టపాక గ్రామంలోనే తేలియా రుమాల్
- వందేళ్ల క్రితమే ప్రకృతి రంగులతో తయారు
- చేనేత కళాకారులకు దక్కిన అత్యుత్తమ అవార్డులు


దారాలపై డిజైన్ వేస్తున్న యువకుడు

నల్లగొండ డెస్క్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామం చేనేత కళాకారులు రూపొందించిన ‘తేలియా రుమాల్’ ప్రపంచ ఖ్యాతి గడించింది. జీ–20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన భారతీయ హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటుదక్కింది. ఈ వస్త్రాలను సదస్సుకు వచ్చే విదేశీ ప్రతినిధులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. తేలియా రుమాల్ అనేది ఒక రకమైన వస్త్రం. తేలియా రుమాల్.. పుట్టపాక ప్రత్యేకం. ఇక్కడి చేనేత కళాకారులు తమ కళా నైపుణ్యానికి పదును పెడుతూ, సృజనాత్మకతను వెలికి తీస్తూ, పోటీతత్వంతో అనేక కొత్త కొత్త డిజైన్లను రుపొందిస్తున్నారు. తేలియా రుమాల్ వస్త్రంతో పుట్టపాక అనే మారుమూల పల్లె చేనేత పరంగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచింది. దాదాపు వంద సంవత్సరాల క్రితమే పుట్టపాక గ్రామంలో తేలియా రుమాల్ వస్త్రంతో నేసిన చేనేత ఉత్పత్తులు అరబ్ దేశాలకు ఎగుమతి చేసినట్లు ఇక్కడి చేనేత కళాకారులు చెప్పారు. తేలియా రుమాల్.. వేసవి కాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండడమే కాక సుగంధ వాసనలు వెదజల్లే ప్రత్యేకత కలిగి ఉంటుంది.

ప్రత్యేక గుర్తింపు

పుట్టపాక తేలియా రుమాల్ అనే వస్త్రంకు పోస్టల్ శాఖ అరుదైన గౌరవం ఇచ్చింది. తేలియా రుమాల్ అనే వస్త్ర తయారీ కళను పోస్టల్ శాఖ పోస్టల్ కవర్‌తో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించింది. తేలియా రూమాల్‌కు భౌగోళిక గుర్తింపు(జీఐ) కూడా ఉంది.

పద్మశ్రీ అవార్డు సొంతం..

తేలియా రుమాల్ భారత దేశంలో మరెక్కడా నేయరు. దేశం మొత్తం మీద పుట్టపాక గ్రామంలోనే తెలియా రుమాల్ తయారు చేస్తారు. ఈ వస్త్రం నేసినందుకు పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కళాకారులు గజం గోవర్ధన్, గజం రాములుకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందజేసింది. దీంతో పాటు పలు జాతీయ అవార్డులు కూడా ఈ గ్రామ చేనేత కళాకారులకు వచ్చాయి.




తేలియా రుమాల్ వస్త్రం


మగ్గంపై తయారవుతున్న తేలియా రుమాల్ వస్త్రం

తేలియా రుమాల్ తయారీకి వాడే ప్రకృతి రంగులివే..


గుమ్మడి రంగు తయారీ


నానబెట్టిన కరక్కాయ పొడి


గుమ్మడి రంగు: గుమ్మడి రంగు వేయడానికి.. అడవి పసుపు(పచ్చి పసుపు), తేయాకు, తమలపాకు కలిపి గుమ్మడి రంగును తయారు చేస్తారు.

తేలియా రంగు: సున్నపు రాయి, అడవి పసుపు, నువ్వుల నూనె, నిమ్మకాయ రసంతో కలిపి తయారు చేస్తారు.

ఇండిగో రంగు: ఇండిగో అనే మొక్కను ఉడకబెట్టి కేక్ మాదిరిగా మారుస్తారు. ఇండిగో మొక్కను చైన్నై నుంచి తీసుకువస్తున్నారు. సున్నం, కుంకుడు రసం, నిమ్మరసం కలిపి తయారు చేస్తారు.

నల్ల రంగు: పాత ఇనుప సామానును 25రోజులు నీటిలో నానబెట్టి తుప్పు పట్టిస్తారు. తాటిబెల్లం, ఇనుప తుప్పు, నల్ల కరక్కాయ పొడి, కుంకుడు రసం, నిమ్మ రసం కలిపి నల్లటి రంగుగా తయారు చేస్తారు.

ఇలా తయారు చేసిన రంగులతోనే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రంకు రంగులు అద్దుతారు.


ఆముదపు పొట్టు


గొర్రె ఎరువు


నువ్వుల నూనెలో శుద్ధిచేసిన దారాలు

ధర ఇలా.. తేలియా రుమాల్ వస్త్రంతో తలపాగాలు, చీరలు, దుప్పటా, కార్ఫ్, డ్రెస్‌మెటీరియల్‌తో పాటు ఇతర దుస్తులను తయారు చేస్తున్నారు. ఈ వస్త్రానికి మీటరు ధర కనిష్టంగా రూ.5 వేలు.. గరిష్టంగా రూ.25వేలు ఉంటుంది. చీరలు డిజైన్లను బట్టి రూ.30వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర ఉంది. తేలియా రుమాల్ వస్త్రం తయారీకి ఎక్కువ రోజులే పడుతుంది. 60 మీటర్ల వస్త్రం తయారు చేయడానికి.. నూలు ప్రాసెస్ సమయం 21 రోజులతో పాటు అదనంగా నెల రోజులు పడుతుంది. ఒక చీర నేయడానికి.. నూలు ప్రాసెస్, రంగుల అద్దడం, ఆరబెట్టడానికి సమయం కలిపి మొత్తంగా మూడు నెలల సమయం పడుతుందని చేనేత కళాకారులు చెప్పారు. ఇవి ఎండాకాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉండడమే గాక సుగంధ వాసనలు వెదజల్లుతాయి.


నూలును ఆరబెడుతున్న చేనేత కళాకారుడు

ఎలా తయారు చేస్తారంటే..

పుట్టపాకలో నేసే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రాలకు ప్రకృతి రంగులే ఆధారం. తెల్ల దారానికి ప్రకృతి రంగులు గుమ్మడి రంగు, తేలియా రంగు, ఇండిగో, నల్ల రంగును ఉపయోగిస్తారు.

- మొదటగా తెల్ల దారానికి జిగురు తొలగించేందుకు గాను ఒక రోజు నీళ్లలో నానబెట్టి నీడలో ఆరబెడతారు. ఇలా వారం రోజులు కష్టపడి తెల్లధారానికి ఉన్న జిగురు తొలగిస్తారు.
- ఆ తర్వాత దారాన్ని శుద్ధి చేయడం కోసం కరక్కాయ పొడి కిలో ఒక్కంటికి 150 గ్రాముల చొప్పున, అల్లం 10గ్రాములతో కలిపి శుద్ధి చేస్తారు.
- ఇలా శుద్ధిచేసిన నూలును 21 రోజుల పాటు ప్రాసెస్ చేస్తారు. మొదట ఆముదపు పొట్టును కాల్చి బూడిద చేస్తారు. నువ్వుల నూనెతో బూడిదను కలిపి, నూలును అందులో ఉంచుతారు. రోజంతా నీటితో కలిపిన గొర్రె ఎరువులో నానబెడతారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నూలును ఉతికి శుభ్రపరిచి.. ఆరబెడతారు. మళ్లీ అందులోనే నానబెడతారు. ఇలా 21రోజులు చేస్తారు.
- ఆ తర్వాత వస్త్రం అవసరాన్ని బట్టి వార్పుపై అవసరమైనంత పొడవులో దారాలను తీస్తారు. మగ్గంపై కావాల్సిన తీరులో డిజైన్లతో కూడిన వస్త్రాన్ని రూపొందిస్తారు.


దారాలను శుద్ధి చేస్తున్న చేనేత కళాకారుడు

సమ్మె బాటలో అంగన్‌వాడీలు

- ఈ నెల 11 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు నోటీసులు అందజేత
- కేంద్రం తాళాలను ఇవ్వాలని సూచించిన సంబంధిత అధికారులు
- అంగన్‌వాడీలను పర్యవేక్షించాలని సూపర్‌వైజర్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 4,203 కేంద్రాలు

భువనగిరిటౌన్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతకు సంబంధించి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారు. ఈ సమయంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు కూడా ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమకు నెలకు రూ.26 వేల వేతనం ప్రకటించాలని, పదవీ విరమణ తరువాత రూ.లక్షకు బదులు రూ.10లక్షలు అందించాలని, తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. ఈమేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 901 అంగన్‌వాడీలు కేంద్రాలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,209 కేంద్రాలు, నల్లగొండ జిల్లాలో 2,093 కేంద్రాలు ఉన్నాయి. తాము అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడంతో పాటు ప్రభుత్వ చేపట్టే అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొంటున్నారు. కాగా.. యాదాద్రి జిల్లాలో ఉన్న 901 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 700 కేంద్రాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, సూర్యాపేట జిల్లాలోని 1209 కేంద్రాలకు గాను 900 కేంద్రాల వారు, అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని 2,093 కేంద్రాలకుగాను 1,800 కేంద్రాల వారు సమ్మెలోకి వెళ్లనున్నారు.


అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ అధికారులు

హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు, సీడీపీఓలు సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెకు వెళ్లకుండా చూడాలని, ఒకవేళ వెళ్తే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇచ్చి సమ్మెకు వెళ్లాలని ఆదేశించారు. వాటి పర్యవేక్షణ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పర్యవేక్షించి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- అంగన్‌వాడీల వేతనం రూ.26వేలుగా నిర్ధారించాలి.


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

- ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లకు కుదించాలి.
- విరమణ పొందిన టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్కు రూ.5లక్షలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ నాటికి తీసుకునే వేతనంలో సగం మేర పెన్షన్ ఇవ్వాలి.
- సీనియారిటీ ఆధారంగా వేతనాల పెంపుతోపాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలి.
- కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.

11 నుంచి సమ్మెలోకి వెళ్తాం



ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాక టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అదనపు బాధ్యతలు పెంచి వేతనం తక్కువ ఇస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం, రిటైర్మెంట్ కింద రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలి. ఈనెల 11నుంచి అనుముల ప్రాజెక్టు మొత్తం టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొంటారు. చర్చలకు పిలువకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం.

– బూరుగు స్వప్న, యూనియన్ అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల రిటైర్మెంట్ ప్యాకేజీ మోసపూరితంగా ఉంది. చర్చల సమయంలో ప్రకటించిన సాయం.. ఇప్పుడు నిర్ణయించిన సాయం సగానికి పడిపోయింది. ఆసరా పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు. పదవీ విరమణ నాటికి తీసుకుంటున్న వేతనంలో సగం మేర పెన్షన్ రూపంలో ఇవ్వాలి. పని భారం పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ల విధులను సర్దుబాటు చేయాలి.

– సీహెచ్, రామకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ఎన్నికల ముందు అన్ని బంధులు పెడుతున్నారని, ఔటర్ వద్ద భూములు అమ్మి అకౌంట్లలో జమచేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 మాసాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17న సోనియాగాంధీ వస్తున్నారని, హామీలు ఇస్తారని తెలిపారు.


మాదిగల పోరాటానికి న్యాయమైన ముగింపునివ్వాలి

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు మాదిగలు 29 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి న్యాయమైన ముగింపు పలకాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నల్లగొండ జిల్లా కందుకూరి సోమన్న దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి వచ్చిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెమోరండం సమర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఎమ్మార్పీఎస్ దీక్షకు తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బోడ సునీల్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన దీక్షా కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మేడి శంకర్ మాదిగ, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో–కన్వీనర్ ఎరిగి శ్రీశైలం మాదిగ, ఎంఎస్పీ నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ చిన్నమాదిగ, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమిరే స్వామి మాదిగ, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడుసు సైదిస్, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలేని యాదయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జీడిమెట్ల రమేష్ ఎంఎస్పీ మండల అధ్యక్షులు, మహిళా సంఘం అధ్యక్షురాలు కూరపాటి కమలమ్మ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు వంగూరి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు మాసార వెంకన్న కత్తుల సన్నీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని ఎంపీని కోరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు శనివారం ప్రాజెక్టు నాలుగు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ నుంచి 5,742 ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండడంతో నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 5,230 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 379 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు కలిపి నుండి 5,742 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 644 (4.20 టీఎంసీల) అడుగుల వద్ద ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.


దిగువకు విడుదలవుతున్న వరదనీరు

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఆదివారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా విరోచితంగా పోరాటం చేశారని, 4500 మంది బలిదానాలు చేశారని కాని, ఈ పోరాటాన్ని కొన్ని పార్టీలు స్వార్థం కోసం రాజకీయంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. వాస్తవానికి తెలంగాణ రాజ్యాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేశారని, దానిని వదిలేసి విముక్తి, విద్రోహం, విమోచనం పేరిట రాజకీయం చేస్తున్నారన్నారు. నాడు జరిగిన పోరాటాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వమే సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తేదీన ఐలమ్మ వర్ధంతి నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిని వారోత్సవాల సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ మండలంలో గూడూరు, తడకమళ్ల, మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు, ఆగామోత్కూరు, వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామాల్లో వారోత్సవాల సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 17న నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి ముడావత్ రవినాయక్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పిల్లుట్ల సైదులు, బాలాజీనాయక్, బాలునాయక్, వెంకట్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి